క్లుప్తంగా

సమ్మర్ క్యాంపు సందర్శన



విద్యార్థులతో వెంకట్‌రెడ్డి

నర్మెట: విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిమిత్తం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. కాగా, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి, రాకేష్ బుధవారం సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుని ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని అన్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ ఎర్రవెల్లి బాబు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు క్యాంపు నిర్వహించబడుతుందని, అండర్–14 విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గొడ్డలితో దాడి.. వ్యక్తికి గాయాలు

బచ్చన్నపేట: తన భూమిని ఆక్రమించడమే కాకుండా అందులో ఉన్న చెట్లు నరుకుతుంటే అడ్డుకోబోయిన రైతును అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాస ఐలయ్యకు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన బియ్య లింగయ్య ఆక్రమించాడు. అంతే కాకుండా అందులో ఉన్న చెట్లను నరుకుతుండగా అడ్డుకున్న సదరు రైతు ఐలయ్యపై లింగయ్య గొడ్డలితో దాడి చేశాడు. అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయి తన భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె 100కి కాల్ చేసింది. దాంతో వెంటనే స్పందించిన పోలీసులు 108 అంబులెన్స్ వాహనంలో గాయపడ్డ ఐలయ్యను జనగామ ఏరియా స్వపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు.

హైనా దాడిలో దూడ మృతి

బచ్చన్నపేట: హైనా దాడిలో దూడ మృతి చెందిన సంఘటన లక్ష్మాపూర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన గొడుగు బాలసిద్దులు తన ఆవులు, దూడలను బావి వద్ద మంగళవారం కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి ఒక దూడను హైనా గాయపర్చి చంపేయగా మరో దూడకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో దాదాపు రూ. 20 వేల విలువైన దూడ మృతి చెందిందని.. అధికారులు హైనాలను పట్టుకొని ఫారెస్ట్‌కు తరలించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు..

పాలకుర్తి: గూడూరు గ్రామం జానకిపురం సమీపంలోని చిక్కుడు సుధాకర్ రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా మేతకు వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. లక్ష విలువచేసే ఆవు మృతి చెందిందని.. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కోరారు.

'కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్న మండల అధ్యక్షుడు'



మండల అధ్యక్షుడిని మార్చాలంటూ తీర్మానం చేస్తున్న కార్యకర్తలు

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ప్రతిపక్షాలకు తొత్తుగా వ్యవహరిస్తూ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నాడని పార్టీ తరిగొప్పుల గ్రామ అధ్యక్షుడు పండుగ కనుకయ్య విమర్శించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరి పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమాచారం లేకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నాడని అన్నారు. మండల అధ్యక్షుడి వ్యవహారంతో పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి ప్రజల వద్దకు వెళ్లడం లేదని కార్యకర్తలు నిరుత్సాహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు మండల అధ్యక్ష పదవి మార్పు కోరుతూ నూతన అధ్యక్షుడి ఎన్నికపై సంతకాలు చేసి ఏకపక్ష తీర్మానంతో డీసీసీ అధ్యక్షుడికి లేఖ రాసి మండల అధ్యక్షుడిగా వేరొకరిని నియమించాలని ఆయనను కోరారు. సమావేశంలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఏడెల్లి శ్రావణ్ రెడ్డి గారు, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు మంద చంద్రయ్య, మండల ఉపాధ్యక్షుడు సిరిగిరి దాసుగారు, అంజిరెడ్డి, కర్ణాకర్రెడ్డి, సంపత్‌రెడ్డి, చిలువేరు సంపత్, సుధాకర్, రవి, సోమయ్య, కొమురెల్లి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు వెళ్తున్నారా..

- హైవేపై అప్రమత్తం.. వేగం వద్దు
- యూటర్న్‌లు.. క్రాసింగ్‌లు
- లోపాలపై ఎన్‌హెచ్ నిర్లక్ష్యం

జనగామ: ఉమ్మడి వరంగల్ జిల్లా కాళేశ్వరం అంతర్వాహిణి సరస్వతీనది పుష్కరాలకు ప్రయాణానికి సిద్ధమవుతున్నారా.. నేషనల్ హైవేపై జాగ్రత్తలు తీసుకోండి. అతి వేగం, అజాగ్రత్త, నిద్రలేమితో డ్రైవింగ్ చేయకుండా సురక్షిత ప్రయాణం సాగేలా చూసుకోండి. పుష్కర స్నానం వేళ.. కాళేశ్వరుడి దర్శనం, ఆశీస్సులతో క్షేమంగా ఇంటికి చేరండి. రహదారిపై ఎన్‌హెచ్ సూచించే ప్రికాషన్లు గమనిస్తూ.. అప్రోచ్ రోడ్లు, క్రాసింగ్‌లు, యూటర్న్, మధ్య మధ్యలో ఊర్లను గమనిస్తూ వేగాన్ని నియంత్రించుకుంటూ ముందుకు సాగాలి. భోజనం చేయడం.. కాసేపు సేద తీరేందుకు వాహనాలను మలుపులు, క్రాసింగ్, రోడ్లపై నిలుపకుండా డ్రైవర్లు, వాహన యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. నేటి(గురువారం) సరస్వతీనది పుష్కరాలు ప్రారంభం నేపథ్యంలో జిల్లా పరిధిలోని వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నేషనల్ హైవేపై జిల్లా పరిధి 37 కిలో మీటర్లు ఉంటుంది. జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరం నుంచి మొదలుకుని చిల్పూరు మండలం చిన్నపెండ్యాల వరకు జనగామ బార్డర్ ఉంది.

సరస్వతీపుష్కరాలకు వెళ్లే వాహన దారులకు సూచనలు..

- కాళేశ్వరం వెళ్లే సమయంలో గ్రామాలు దాటే వరకు వేగాన్ని నియంత్రించుకోవాలి.
- జంక్షన్లు, యూటర్న్‌లు క్రాస్ చేసే వాహనాలను గమనిస్తూ ముందుకు సాగాలి.
- ముందుగా వెళ్లే వాహనాల ఇండికేటర్ లైట్లను గమనించాలి.
- అప్రోచ్ రోడ్లను గమనిస్తూ డ్రైవింగ్ చేస్తే ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారాలు ఉండవు.
- పోలీసులు ఏర్పాటు చేసే బారికేడ్ల వద్ద వేగాన్ని ఖచ్చితంగా నియంత్రించాలి. ఓవర్ స్పీడ్‌తో ముందుకు వెళ్లరాదు.
- సిగ్నలింగ్ లైట్లు, కాషన్ బోర్డులను గమనించాలి.

చిల్పూరు మండల పరిధిలో..



చిల్పూరు: నష్కల్ జంక్షన్‌లో యూటర్న్ వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తున్న ఆటో

చిల్పూర్ మండలం నేషనల్ హైవే చిన్న పెండ్యాల బస్ స్టేజీ నుంచి వంగాలపల్లి గ్రామం వరకు మూడుచోట్ల డేంజర్ జోన్లు ఉన్నాయి. నష్కల్ బస్ స్టేజీ సమీపం యూటర్న్ వద్ద ఇప్పటి వరకు 22 ప్రమాదాలు జరుగగా, ముగ్గురు మృత్యువాత పడ్డారు. చిన్న పెండ్యాల గ్రామ సమీపంలోని గ్రానైట్, గ్యాస్ కంపెనీ యూటర్న్ వద్ద ఎనిమిది మంది చనిపోగా, 20 మంది వరకు గాయపడ్డారు. రాంగ్‌రూట్ వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి.

రఘునాథపల్లి పరిధిలో..



రఘునాథపల్లి: ప్రమాదకరంగా ఉన్న గోవర్ధనగిరి క్రాసింగ్

నేషనల్ హైవేపై ప్రయాణంలో అత్యంతం డేంజర్ రఘునాథపల్లి పరిధిగా చెప్పుకోవచ్చు. నిడిగొండ, గోవర్ధనగిరి క్రాసింగ్‌ల సమీపంలో వేగం నియంత్రణ చేసుకోవాలి. నిడిగొండ రైల్వే బ్రిడ్జి కింద నిబంధనలకులోబడి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ఒక్క ఏడాది రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. నిడిగొండ బస్టాప్ నుంచి ఫతేషాపూర్ రూట్‌లో కాలినడకన రోడ్డు దాటే క్రమంలో నాలుగేళ్లలో 18 మంది బాట సారులను మృత్యువు కబలించింది. స్టేజీల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హైవేపై నిరంతరం పెట్రోలింగ్



సరస్వతీనదీ పుష్కరాల నేపథ్యంలో వెస్ట్‌జోన్ పరిధి నేషనల్ హైవేపై నిరంతరం పెట్రోలింగ్ కొనసాగుతుంది. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను ముందుగానే గుర్తించి, అక్కడ కూడా నిఘా ఏర్పాటు చేసినం. భక్తులు పున్య స్నానాలు ఆచరించి, తిరగి వెళ్ల వరకు హైవేపై పోలీసుల పర్యవేక్షణ ఉంటు ంది. వాహన డ్రైవర్లు అతి వేగంతో వెళ్లకుండా నియంత్రణలో ఉంటే సురక్షత ప్రయాణానికి అవకాశం ఉంటుంది.

- రాజమహేంద్రనాయక్, డీసీపీ, జనగామ

స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో..



స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్ స్టేజీ వద్ద పొంచి ఉన్న ప్రమాదం

స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ బస్ స్టేజీ, మీదికొండ క్రాసింగ్, ఛాగల్ బస్ స్టేజీ, కొత్తపల్లి క్రాస్ రోడ్, డివిజన్ కేంద్రం బస్టాండ్ సమీపంలో ప్రమాదాలకు ఆస్కారం ఉంది. గడిచిన 5 నెలల కాలంలో వీటి పరిధిలో 15కు పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మీదికొండ క్రాసింగ్ వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు స్పాట్‌లో చనిపోయారు. ప్రమాదాలు జరుగకుండా ఎన్‌హెచ్ నిబంధనలకు లోబడి బారికేడ్లు, సిగ్నల్ లైట్లు, వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

జనగామ పరిధిలో..



జనగామ: పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద ఉన్న యూటర్న్

జనగామ మండలంలోని పెంబర్తి టంగుటూరు క్రాసింగ్, ఊరి మధ్యలోని జంక్షన్, నెల్లుట్ల, యశ్వంతాపూర్ క్రాసింగ్ తదితర చోట్ల వాహనాలు యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆర్‌ఎంపీ ఇంట్లో తనిఖీలు

- డీఎంహెచ్‌ఓ ఫిర్యాదుతో కేసు నమోదు

రఘునాథపల్లి: శ్రీమన్నారాయణపురంలో బత్తిని రవీందర్ అనే ఆర్‌ఎంపీ వైద్య అర్హతలు లేకపోయినప్పటికీ ప్రమాదకరమైన మందులతో వైద్య సేవలు అందిస్తున్నాడని జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన రవీందర్ వైద్య అర్హతలు లేకపోయినప్పటికీ అక్రమంగా మందులను నిల్వ చేసి గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నాడని ఈ నెల 13వ తేదీన వైద్యాధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో డీఎంహెచ్‌ఓతో పాటు మండల వైద్యాధికారి కమల హాసన్, ఔషధ అధికారి అలె బాలకృష్ణ, ఏఎస్‌ఎం నిర్మల, మాస్ మీడియా ఎం.ప్రభాకర్ సంయుక్తంగా శ్రీమన్నారాయణపురం చేరుకుని ఆర్‌ఎంపీగా సేవలందిస్తోన్న రవీందర్ ఇంట్లో తనిఖీలు చేసి అర్హత లేకుండా వైద్య సేవలందిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా నిల్వచేసిన గర్భధారణ కొల్పోయే ఔషధం, కాంబీప్యాక్ ఆఫ్ మిఫెప్రిస్టోన్, మిసోప్రాటోల్ టాబ్లెట్ల కిట్, ఐదు అబార్టివ్ డ్రగ్ టాబ్లెట్లు, ఇతర ముందులు సీజ్ చేశారు. డీఎంహెచ్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంఎల్‌టీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కొడకండ్ల: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాల అప్‌గ్రేడ్‌లో భాగంగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సును ప్రారంభించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ మమత ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ ఎంఎల్‌టీ కోర్సును ప్రారంభించడం జరుగుతుందని, 40 పరిమిత సీట్లు మాత్రమే ఉన్నందున ఆసక్తి కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. వివరాల కోసం 7702806756 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఆమె తెలిపారు.

ఇరిగేషన్ పనుల అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీదేవి

తరిగొప్పుల: దేవాదుల ఫేస్–2 పనుల్లో భాగంగా జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మండలంలోని నర్సాపూర్ గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నర్మెట మండలంలోని గండిరామవరం గ్రామంలోని మల్లన్న గండి రిజర్వాయర్ నుంచి తరిగొప్పుల మండలంలోని బొంతగట్టు నాగారం వరకు జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా నర్సాపూర్ గ్రామం మీదుగా పైపులైను వెళ్తున్నందున గ్రామ ఊర చెరువును నింపేలా చూడాలన్నారు. వెంటనే పైపు నిర్మాణ పనులను చేపట్టాలని లేనిచో పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఘటనా స్థలం వద్దకు ఎస్సై గుగులోత్ శ్రీదేవి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి మీ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. తుపాలకు సత్తయ్య, సంపత్, ఎనుగుల ఎల్లయ్య, కనుకయ్య, వెంకన్న, మ్యాక శంకర్, మహేందర్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

రఘునాథపల్లి: నిడిగొండ సమీపంలోని సత్యసాయి కాన్వెన్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరుగనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అహ్మద్, రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని ఆయన కోరారు.

కనులపండువగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో మాలధారులు

నర్మెట: హనుమాన్ మండల దీక్షా స్వాములు బుధవారం మండలకేంద్రంలో భక్తి ప్రపత్తులతో కనులపండువగా హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా 18 అడుగుల హనుమాన్ విగ్రహంతో గురుస్వామి ఆమెడపు లక్ష్మయ్య ఆధ్వర్యంలో భజనలతో వీధుల్లో ఊరేగిస్తూ నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. గత నెల 12న మాలధారణతో దీక్షలు ప్రారంభించిన స్వాములు ఈనెల 22వ తేదీన వైశాఖ బద్దదశమి హనుమజ్జయంతిని పురస్కరించుకుని దీక్ష విరమణ చేయనున్నారు. కాగా, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, బిజ్జ సత్యనారాయణ మహాన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న విద్యానాథ్

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మండల ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషితో పనిచేయాలన్నారు. కొడవటూర్ దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, మహిళా కార్యదర్శి బాగ్యలక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు సరికాదు



పోలీసుల అదుపులో ఉన్న షబానా

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానాను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య పేర్కొంటూ తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందాల పోటీలను వ్యతిరేకించిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ పని చేస్తున్న ఐద్వా నాయకురాలు షబానాను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి గుండె బోయిన, నాయకులు కాట సుధాకర్, ఐలయ్య, రాములు, రాజు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు. అలాగే ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానాను అక్రమంగా అరెస్టు చేయడంపై ఐద్వా మండల కార్యదర్శి రాపర్తి రజిత తీవ్రంగా ఖండించారు. మహిళల ఆత్మగౌరవానికి భంగంకలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించడం సరికాదన్నారు.

ఐద్వా కమిటీ సభ్యుల అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: మిస్‌వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, 14న అడ్డుకుంటామని ఐద్వా ప్రకటించడంతో బుధవారం కమిటీ సభ్యులను అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లలో ఉంచారు. ఈ సందర్భంగా ఐద్వా కమిటీ అక్రమ అరెస్టులను ఖండించింది. అందాల పోటీలో పాల్గొనే యవతులు బుధవారం వరంగల్‌కు వెళ్తున్న సందర్భంగా అడ్డుకుంటారనే సమాచారంతో ప్రజాతంత్రత మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ షబానాను స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాయకులను విడుదల చేయాలి

పాలకుర్తి: అందాల పోటీలు రద్దు చేయాలని వ్యతిరేకించిన నాయకులను విడుదల చేయాలని ఐద్వా మండల నాయకురాలు నక్క సంపూర్ణ కోరారు. మండలంలోని గూడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో సంపూర్ణ మాట్లాడారు. బెల్లి విజయ, రజిత, నక్క పద్మ, పుల్లమ్మ, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపాలకుల పునఃప్రతిష్ఠ

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో బుధవారం చండ ప్రచండ (ద్వారపాలకుల) పునఃప్రతిష్ఠ చేశారు. జీడికల్ గ్రామానికి చెందిన నర్రా దిలీప్‌రెడ్డి దాతగా సుమారు రూ.50వేల విరాళం అందజేయగా ద్వారపాలకును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు శ్రీనివాసాచార్యుల వేదమంత్రోచ్ఛారణలతో జరుగగా దేవస్థాన చైర్మన్ ఏలె మూర్తి, ఆయల పూజారులు భార్గవాచార్యులు, మురళీధరాచార్యులు, జనగామ ఉప్పలమ్మ దేవాలయ ఈఓ రాములు, స్థానిక ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో నాలుగు రోజుల పాటు కొనసాగే దుర్గామాత ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామస్తులు ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పోచమ్మ తల్లికి బోనాలు చేశారు. అర్ధరాత్రి ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ కూడలిలోని బొడ్రాయి వద్దకు చేరుకుని అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు.

ఎవరు అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఎవరి హయాంలో మంజూరయిన అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారో, ఎవరు ఏమి అభివృద్ధి చేశారో ఘన్‌పూర్‌లోని బొడ్రాయి ఎదుట చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రాజయ్య సవాల్ విసిరారు. నియోజకవర్గం కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో మంజూరు అయిన అభివృద్ధి పనులనే ప్రారంభిస్తూ తానే కాంగ్రెస్ ప్రభుత్వంలో తీసుకవచ్చానని కడియం చెప్పు కోవడం సిగ్గుచేటన్నారు. మారపాక రవి, తాటికొండ సురేష్, కుంభం కుమార్, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేషం, గుర్రపు ప్రవీణ్, ఆకారపు అశోక్, రాజు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం



దగ్ధమైన ఆయిల్ పామ్ తోట

లింగాలఘణపురం: నెల్లుట్లలో విద్యుత్ ప్రమాదంతో బుధవారం కొయ్యాడ వేణుగోపాల్‌కు చెందిన ఆయిల్‌పామ్ తోట దగ్ధం కావడమే కాకుండా అందులోని డ్రిప్, పైపులైన్ కాలిపోయి నష్టం జరిగింది. వేణుగోపాల్ ఆయిల్‌పామ్ తోట మధ్యలో ఎస్‌ఎస్–18 నంబర్ గల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మిరుగులు పడి మంటలు చెలరేగాయి. గత ఏడాది వేసవిలో కూడా ఇదే విధంగా మంటలు చెలరేగి తోట కాలిపోయిందని, గతంలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని ఫిర్యాదు చేశామని, అయినప్పటికి స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని ఏఈ శంకరయ్యకు మరోసారి వినతి పత్రం అందజేసినట్లు బాధిత రైతు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేద్దాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

దేవరుప్పుల: కాంగ్రెస్ పటిష్టతకోసం సమన్వయంతో కృషి చేద్దామని పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేడు(గురువారం) నిర్వహించే మండల సన్నాహక సమావేశం కోసం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరుపై పార్టీ శ్రేణులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరగబోయే సంస్థాగత నిర్మాణ సన్నాక సమావేశానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి వస్తున్నారన్నారు. నేడు ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో తలపెట్టిన సమావేశానికి అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చేలా కృషి చేయాలని కోరారు. సీనియర్ నాయకులు ఉప్పల సురేష్‌బాబు, ధర్మారెడ్డి, వంగ దశరథ, దావెర అనిల్‌కుమార్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

కుంకుమార్చన

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామంలోని దుర్గామాత ఆలయంలో బుధవారం మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు కార్తీక్ శర్మ నేతృత్వంలో దుర్గామాతను నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన చెరిపెల్లి కిష్టయ్య(55) గుండె పోటుతో మృతి చెందారు. కాగా, బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని మృతుదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కిష్టయ్య మృతి పార్టీకి తీరని లోటని దయాకర్‌రావు అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, బొబ్బాల అశోక్ రెడ్డి, నల్ల నాగిరెడ్డి, పున్నూరి శ్రీనివాస్‌రావు, మాచర్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

'చర్యలు తీసుకోవాలి'



నంబర్ ప్లేట్ లేని వాటర్ క్యాన్లు సప్లై చేస్తున్న ఆటో

జనగామ: జిల్లా కేంద్రంలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే విధంగా అతి వేగంగా వెళ్తూ వాటర్ క్యాన్లను సప్లై చేసే ఆటోలను మోటారు రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన సుంచు శ్రీకాంత్ వారికి బుధవారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ నుంచి గుండ్లగడ్డ కాలనీకి వెళ్లే క్రమంలో వాటర్ క్యాన్లు సరఫరా చేస్తున్న ఆటో డ్రైవర్ పార్కింగ్ ఇండికేటర్ వేయకుండా వేగంగా వెళ్తున్నట్లు చెప్పారు. ఇళ్ల ఎదుట రోడ్డుగా అడ్డంగా ఆటోలను నిలుపుతూ, వాహన చోదకులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు నిలదీస్తే దిక్కునచోట చెప్పుకోమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రజలు నిలదీస్తుంటే ఖాతరు చేయడం లేదని, రవాణాశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతోనే ఇలాంటిపరిస్థి ఉందన్నారు. ఆటోలకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా లేవని, ఫిట్‌నెస్, డ్రైవర్లకు లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉందా లేదా అని తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నియామకం

జఫర్‌గఢ్: వడ్డెగూడేనికి చెందిన గంధం చంద్రమౌళిని భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్యయాదవ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి విలేకరులతో మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సమ్మయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో భూమాత ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బైక్ చోరీ

దేవరుప్పుల: కామారెడ్డిగూడెంలో ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్‌ను మంగళవారం రాత్రి చోరీకి గురైంది. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని కామారెడ్డిగూడెం పరిధి జనగామ–సూర్యాపేట రహదారి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఓ భవనంలో మరిపడిగెకు చెందిన అనతులు సురేష్ కుమార్ కిరాయి ఉంటున్నారు. ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రాత్రి పల్సర్ బైక్‌కు తాళం వేసి పార్కింగ్ చేశాడు. బుధవారం తెల్లారి చూసేసరికి బైక్ కనబడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థికసాయం

జఫర్‌గఢ్: ఓబులాపూర్ గ్రామానికి చెందిన అలుగోజు వెంకటయ్యచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు పార్టీ బృందంతో కలిసి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ గార్లపాటి నీరజరెడ్డితో పాటు కాంగ్రెస్ గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.